ప్రజాశక్తి

శనివారం 9 సెప్టెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

నిధుల్లేక నిర్వహణ వదిలేశారు

- ఆయకట్టుకు సాగునీటి సమస్య
- సగం కూడా జరగని వరి సాగు
- 75 వేల ఎకరాలకు 32 వేల ఎకరాల్లోనే పంట నమోదు
- పిచ్చిమొక్కలతో నిండిన ప్రధాన కాలువలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కంటే సాగునీటి వనరుల పట్ల ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం రైతుకు తీరని నష్టం తెచ్చిపెట్టింది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు జలాశయాలు, కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టాల్సివుంది. అడ్డంకులు లేకుండా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయడం నీటిపారుదల శాఖ కనీస బాధ్యత. అయితే ఈ ఖరీఫ్‌కు ముందు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో నిర్వహణ పనులను ఆ శాఖాధికారులు చేపట్టలేదు. దీంతో జలాశయాల్లో ఉన్న నీటిని ఆయకట్టుకు సరఫరా చేయలేని పరిస్థితి ఈ ఏడాది ఏర్పడింది. అటు వర్షాల్లేక, ఇటు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేక ఖరీఫ్ కాలపరిమితి ముగుస్తున్నా ఉడుపులు చేయలేని దీనావస్థలో రైతులున్నారు. జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాలకు ఈ నెల 7 నాటికి 81,802 ఎకరాల్లో (60 శాతం) నమోదైంది. వరి సాగుకు గడువు దాదాపు చివరకొచ్చింది. ఇంకా 40 శాతం సాగు కాలేదు. సాగైన వరి పంటలో దాదాపు సగం పంట వర్షాల్లేక, ఆయకట్టుకు నీరు అందక ఎండిపోతోంది. అయినా ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని రైతును ఆదుకొనే మార్గాలు అన్వేషించడంలేదు. ప్రభుత్వ యంత్రాంగంతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించనూలేదు.

ఒక భారీ, మూడు మధ్య తరహా జలాశయాల కిందవున్న ఆయకట్టులోని సగం విస్తీర్ణంలో కూడా వరి సాగు నమోదుకాలేదు. భారీ ప్రాజెక్టు తాండవ, మధ్య తరహా ప్రాజెక్టులు పెద్దేరు, కోనాం, రైవాడ కింద మొత్తం 75,114 ఎకరాల ఆయకట్టు వుంది. ఈ నెల ఏడు నాటికి మిగతా 2లో..

పిచ్చిమొక్కలు, గడ్డితో నిండి ఉన్న పెద్దేరు కుడి కాలువ

'పట్టణ ప్రణాళిక'లో అంతర్గత బదిలీలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగంలో అంతర్గత బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇటీవల ఓ నలుగురు ఉద్యోగోన్నతులు పొంది బదిలీ కాగా వారిలో ముగ్గురిని రిలీవ్ చేశారు. ఇటీవల ఎసిపిలుగా ఉద్యోగోన్నతి పొంది విశాఖ వచ్చిన మరో ఇద్దరు అధికారులను జాయిన్ చేసుకొని వివిధ జోన్ల బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఉన్న అధికారులను కొంతమందిని జోన్లకు మార్చారు. రాజకీయ సిఫార్సులకు పెద్దపీట వేస్తూ కమిషనర్ ఈ బదిలీలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పలువురికి స్థానభ్రంశం

జోన్ 1 భీమిలిలో ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న దావాలా శ్రీనివాసును యథాతథంగానే కొనసాగించారు. జోన్ 2 మధురవాడ ఎసిపిగా మళ్లీ శాస్త్రిని నియమించారు. జోన్ 3 ఆశీల్‌మెట్టకు ఎసిపిగా సిహెచ్.రఘునాథరావును నియమించారు. జోన్ 4 మిగతా 2లో..

దేవాదాయ భూములను పరిరక్షించాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : జిల్లాలో ఉన్న దేవాదాయ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాలకుపైగా దేవాదాయ భూములున్నాయని, వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అధికార, ప్రభుత్వ పెద్దల సహకారంతో కోట్లు విలువైన పలు దేవాదాయ భూములు, స్థలాలు ఆక్రమణలకు గురౌతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములకు సంబంధించి ఇష్టానుసారంగా రికార్డులు తారుమారు చేసి సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. దేవరాపల్లి మండలం మారేపల్లి రెవెన్యూ పరిధిలోని 115 సర్వే నెంబరులో ఉన్న 23 ఎకరాల దేవాదాయ మిగతా 2లో..

జైళ్ల శాఖ జాతీయ సదస్సుకు సన్నాహాలు

వార్త 8లో..

విమ్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

వార్త 8లో..

నేడు ఎయు స్నాతకోత్సవం

- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- అల్లూరి ఇంద్రకుమార్, కొలకలూరి ఇనాక్‌లకు గౌరవ డాక్టరేట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం 87, 88, 89, 90 సంయుక్త స్నాతకోత్సవం నేడు జరగనుంది. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో ప్రారంభం కానున్న ఈ స్నాతకోత్సవానికి ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు. ముఖ్య అతిథిగా జిఎంఆర్ సంస్థల అధినేత, ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ జిఎం.రావు హాజరై స్నాతకోత్సవ ప్రసంగం అందిస్తారు. స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్లను పరిశ్రమలు - శాస్త్ర రంగంలో అవంతి ఫీడ్స్ సంస్థ ఎమ్‌డి అల్లూరి ఇంద్రకుమార్ (డిఎస్‌సి), సాహిత్యం-కళా రంగాలలో ఎస్‌వి.యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి కొలకలూరి ఇనాక్ (డిలిట్)లకు అందించనున్నారు. స్నాతకోత్సవంలో డాక్టరేట్లను 690 మంది, మెడల్స్‌ను 600 మంది అందుకోనున్నారు. 2500 మంది హాజరుకానున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. స్నాతకోత్సవ ఏర్పాట్లను ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి శుక్రవారం స్వయంగా పర్యవేక్షించారు. అధికారులతో కలిసి కార్యక్రమ నిర్వహణపై చర్చించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న విసి ప్రసాద్‌రెడ్డి

గవర్నర్‌కు ఘన స్వాగతం

జిల్లాలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, మిగతా 2లో..

కవగుంట భూములపై విచారణ

వార్త 8లో..

జీతాలు పెంచాలని సెవెన్‌హిల్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖ జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లేబర్ ఆఫీసు వద్ద సెవెన్ హిల్స్ కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ జీతాలు పెంచాలని పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ సెవెన్ హిల్స్ కార్మికులకు జీతాలు పెంచడం లేదని, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని అన్నారు. చట్టపరమైన బోనస్ కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మహిళలపై తీవ్ర పని ఒత్తిడి, అధికారుల వేధింపులు ఉన్నాయన్నారు. కార్మికులను కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు యాజమాన్యానికి వినతి పత్రం ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ధర్నా అనంతరం ఎసిఎల్ సర్కిల్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఆయన స్పందిస్తూ వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల సంఘం నాయకులు సిహెచ్.నూకరాజు, శ్రీను, వెంకటరావు, సిలోమని, రాజి, వరలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ కుమార్, రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సెవెన్‌హిల్స్ హాస్పిటల్ కార్మికులు

మొదటి పేజీ తరువాయి..

నిధుల్లేక నిర్వహణ వదిలేశారు

ఈ జలాశయాల కింద 32,001 ఎకరాల్లో (42 శాతం) వరి సాగైంది. ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రధాన కాలువలు మొదలుకొని పిల్ల కాలువల వరకు నిర్వహణ చేయకపోవడం, ప్రాజెక్టు మెయిన్‌గేట్ వద్ద లీకేజీలు నియంత్రించకపోవడం, మదుములు దెబ్బతినడం వంటి పలు సమస్యలు వల్ల ఆయకట్టుకు సక్రమంగా నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జలాశయాల ఆయకట్టుల్లో వరి సాగు కాలేదు. వరి సాగైన ప్రాంతాల్లో నీరు ఇవ్వలేక, వర్షాల్లేక ఉడిసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. తాండవ కింద అనకాపల్లి జిల్లాలో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,776 ఎకరాలు మొత్తం 51,465 ఎకరాల ఆయకట్టు వుంది. ఇంత ప్రధానమైన ప్రాజెక్టు మెయిన్ గేట్ లీకేజీతో నీరు వృథాగా పోతున్నా, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. పెద్దేరు కాలువ పనులు చేపట్టకపోవడంతో.. ఆయకట్టుకు నీరు ఇవ్వలేకపోవడంతో దీనికిందవున్న పొలాల్లో ఉడుపులు సగం కూడా కాలేదు. పెద్దేరు కుడి కాలువ చిన్నపాటి అడవిని తలపించేలావుంది. పిచ్చి మొక్కలతో గుర్తుపట్టలేనంత ఘోరంగా తయారైంది. పెద్దేరు కింద 15,105 ఎకరాలకు 7,187 ఎకరాలు (47.58 శాతం) సాగైంది. కోనాం కింద 12,276 ఎకరాలకు 7,100 ఎకరాలు (57.84 శాతం), రైవాడ కింద 15,344 ఎకరాలకు 6,464 ఎకరాలు (42.13 శాతం) వరి సాగైంది. వరి సాగు చేసేందుకు ఆకులు కూడా కొన్ని ప్రాంతాల్లో ముదిరిపోగా, కొన్నిచోట్ల ఎండిపోయాయి. శారదా నది పరిధిలోవున్న గ్రోయిన్లు మరమ్మతు చేపట్టకపోవడంతో వాటి పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు. పూడిగెడ్డ, పెదపాడు కల్లి కాలువ, కొండకర్లఆవ కాలువ నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ఆ కాలువలు తుప్పలతో నిండివున్నాయి.

'పట్టణ ప్రణాళిక'లో అంతర్గత బదిలీలు

ఎసిపిగా వినయ్ ప్రసాద్‌ను యథాతథంగా కొనసాగించారు. జోన్ 5 జ్ఞానాపురం ఎసిపిగా యు.రామకృష్ణను నియమించారు. జోన్ 6 గాజువాకకు ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన ఎం.శ్రీలక్ష్మిని ఎసిపిగా నియమించారు. జోన్ 7 అనకాపల్లికి ఇటీవల ఉద్యోగోన్నతి పొంది నందిగామ నుంచి బదిలీపై వచ్చిన కె.ఝాన్సీలక్ష్మిని ఎసిపిగా నియమించారు. జోన్ 8 పెందుర్తికి ఎసిపిగా ఉన్న కె.జయరాం విశాఖపట్నం ఆర్‌జెడికి బదిలీ అయినప్పటికీ ఆయన్ని కమిషనర్ రిలీవ్ చేయలేదు. బిఆర్‌టిఎస్ రోడ్ల విస్తరణ పనులు మధ్యలో ఉన్నందున అవి పూర్తి చేశాకే రిలీవ్ చేస్తారని ప్రచారం సాగుతోంది. బొబ్బిలి నుంచి ఉద్యోగోన్నతి పొంది ఎసిపిగా వచ్చిన ఎస్.వెంకటేశ్వరరావును అడ్వర్‌టైజ్‌మెంట్ ఎసిపిగా నియమించారు. అయితే డిసిపిలకు కూడా జోన్ల బాధ్యతలు మార్పు చేస్తారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం 1 నుంచి 4 జోన్లను డిసిపిగా నరేంద్ర నాథ్ రెడ్డి చూస్తున్నారు. జోన్ 5 నుంచి 8 వరకు డిసిపిగా పద్మజ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరికి చెరో రెండు జోన్లు తప్పించి ఇటీవల సిటీ ప్లానర్‌గా ఉద్యోగోన్నతి పొంది జివిఎంసిలో బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీదొరకు సిటీ ప్లానర్ బాధ్యతలతో పాటు నాలుగు జోన్ల డిసిపి బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. జివిఎంసిలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును వియంఆర్‌డిఎకు ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేయడంతో ఆయన్ని జివిఎంసి నుంచి రిలీవ్ చేశారు. గాజువాక ఎసిపిగా పని చేస్తున్న సంపూర్ణ మహాపాత్రను తొలుత బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేయగా ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు డిసిపిగా నియమిస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆయన కూడా జివిఎంసి నుంచి రిలీవ్ అయ్యారు. అనకాపల్లి ఎసిపిగా పనిచేస్తున్న అరుణవల్లిని రాజమండ్రి రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆమెను కూడా జివిఎంసి నుంచి రిలీవ్ చేశారు.

దేవాదాయ భూములను పరిరక్షించాలి

భూములను ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్లాట్లుగా మార్చి అమ్మకాలకు ప్రయత్నిస్తున్నారన్నారు. అనకాపల్లి మండలం సత్యన్నారాయణపురంలో సర్వే నెంబర్లు 633/2, 633/3లో సుమారు ఏడు ఎకరాలకుపైగా ఉన్న సత్యన్నారాయణ స్వామి భూముల్లోనుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రోడ్డు వేసేందుకు సిద్ధమయ్యారన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఇవే పరిస్థితులు దాపురించాయని తెలిపారు. దేవాదాయ భూములు ఆక్రమణలకు గురౌతున్నా వాటిని నియంత్రించే చర్యలను ప్రభుత్వ యంత్రాంగం చేపట్టడం లేదన్నారు. తక్షణమే ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకుని దేవాదాయ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లను నెరవేర్చకుంటే 16 నుంచి సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈసరికే సమర్పించిన సమ్మె నోటీసులో పేర్కొన్న డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 16 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగటం తప్పదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు తెలిపారు. శుక్రవారం జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి మరోసారి వారు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ జివిఎంసి పారిశుధ్య విభాగంలో 482 పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా 218 పోస్టులనే భర్తీ చేశారని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, లాంగ్ సిక్, ఆబ్సెంట్ కార్మికులు, చనిపోయిన, 60 సంవత్సరాలు దాటిన కార్మికుల బిడ్డలతో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలన్నారు. జనాభా, నగర విస్తీర్ణం పెరుగుదల మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలన్నారు, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, క్లాప్ వాహనాలకు అదనంగా సిబ్బందిని నియమించాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.నాయుడు, సత్యనారాయణ, అనిల్ కుమార్, సురేష్, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మేయర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

'విశాఖలో రూ.2800 కోట్ల కుంభకోణం'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తప్పుడు పత్రాలతో రూ. 2800 కోట్ల టిడిఆర్ ప్రాతిపాదనలకు వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి ఆదేశాలతో జివిఎంసి అధికారులు ఫైలు కదుపుతున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయసాయిరెడ్డి పెద్ద స్కాంకు విశాఖలో తెరతీశారన్నారు. వందేళ్ల నాటి రాణి సాహిబా వాద్యాన్ భూమి అంటూ పెదజాలరిపేట మత్స్యకార గ్రామంపై చేసిన క్లెయిమ్‌ను వివరించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో మూడో లైన్‌లో మకుడి-సిర్పూర్-శ్రీపూర్-కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య ప్రీ-నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్ల దారి మళ్లించబడ్డాయని అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఎపి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు విజయనగరం, టిట్లాగఢ్, రాయ్‌పూర్, గోండియా, నాగ్‌పూర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 20806 న్యూఢిల్లీ - విశాఖపట్నం ఎపి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు నాగ్‌పూర్, గోండియా, రాయ్‌పూర్, టిట్లాగఢ్, విజయనగరం మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 20803 విశాఖపట్నం - గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 14, 21 తేదీల్లో విజయనగరం, టిట్లాగఢ్, రాయ్‌పూర్, గోండియా, నాగ్‌పూర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 20804 గాంధీధామ్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 24న నాగ్‌పూర్, గోండియా, రాయ్‌పూర్, టిట్లాగఢ్, విజయనగరం మీదుగా మళ్లించిన మార్గంలో వెళ్తుంది.

12803 విశాఖపట్నం-హజ్రత్ నిజాముద్దీన్ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 22, 25 తేదీల్లో విజయనగరం, టిట్లాగఢ్, రాయ్‌పూర్, గోండియా, నాగ్‌పూర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 12804 హజ్రత్ నిజాముద్దీన్ - విశాఖపట్నం స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 20, 24 తేదీల్లో నాగ్‌పూర్, గోండియా, రాయ్‌పూర్, టిట్లాగఢ్, విజయనగరం మీదుగా మళ్లించిన మార్గంలో, 20819 పూరీ-ఓఖా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 24న విజయనగరం, టిట్లాగఢ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా మళ్లించిన మార్గంలో పయనిస్తుంది. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఎంపీ ఎంవివి 'తూర్పు'లో విస్తృత పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంపీ, వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. 20వ వార్డు లాసన్స్ బే కాలనీలో శ్రీ బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక మహోత్సవాలకు మహార్నవు రాట వేశారు. 19వ వార్డు మూలపాలెం గ్రామపెద్దలు, మత్స్యకార సొసైటీ డైరెక్టర్లు వారి సమస్యలను ఎంపీకి చెప్పుకోగా పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. 20వ వార్డు శివాజీ పాలెంలో శ్రీ విగ్నేశ్వర, శ్రీకృష్ణుని శ్రీ పోలమాంబ అమ్మవారి ముఖ ద్వార ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం తొమ్మిదో వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎంపీ ఎంవివి ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

వధువుకు తాళి బొట్టు, పట్టు వస్త్రాల వితరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో నవవధువు వరలక్ష్మీదేవికి బంగారు తాళిబొట్టు, పట్టు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎయు స్నాతకోత్సవం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, తదితరులు ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ పోర్ట్ అతిథి గృహనికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు పోర్టు డిప్యూటీ ఛైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే, కార్యదర్శి టి.వేణుగోపాల్ స్వాగతం పలికారు. శనివారం గవర్నర్ ఎయులోని మూడు హాస్టళ్లను ప్రారంభించనున్నారు.

గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ విశ్వనాథన్

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఎంతో మంది త్యాగాలతో ఏర్పడి, వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 939వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఎం.త్రినాథ్, కె.రవికుమార్, డి.సత్య నారాయణరావు, ఎస్ఎల్.నాయుడు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయాధికార సంస్థల పిలుపుమేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కోర్టులలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డిఎల్ఎస్ఎ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఎంవి శేషమ్మ ప్రకటన విడుదల చేశారు. లోకదాలత్‌ను వినియోగించుకుని కక్షిదారులు తమ కేసులను రాజీలు చేసుకుని లబ్ది పొందాలని సూచించారు. విశాఖపట్నం జిల్లాలోనిబ్యాంకులు, ఇన్సూరెన్స్,జివిఎంసి, పోలీసులు, ఇతర అన్ని శాఖలప్రధాన అధికారులతో సంప్రదించి, 4259 కేసులు రాజీకి గుర్తించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39 ప్రజాన్యాయ పీఠాలు ఏర్పాటు చేసి ఈ కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

పోస్టరు ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక బిసి.రోడ్డు వాంబే కాలనీ వద్ద ఈనెల 9న గీతం హాస్పిటల్ (వైద్యకళాశాల) ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. గీతం వైద్యకళాశాల సామాజిక సేవా కార్యక్రమంలో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్యశిబిరంలో 35మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ఉచిత రక్తపరీక్షలతోపాటు ఇసిజి, ఇతరత్రా వ్యాధినిర్ధారణ పరీక్షలను ఉచితంగానే నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యక్షుడు ఎంవివి.శ్రీభరత్, విశాఖ జిల్లా టిడిపి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో 65వ వార్డు ఇన్‌ఛార్జి బైబిల్ గాంధీ, వార్డు టిడిపి అధ్యక్షులు రట్టి వాసు, క్లస్టర్ ఇన్‌ఛార్జి అంగ కృష్ణ, తెలుగు మహిళా నేత కె. ప్రభావతి. పార్టీ జిల్లాకార్యదర్శి వియ్యపు కొండబాబు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటరావు, కోడి శీను, ఆనంద్ పాల్గొన్నారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. జిల్లా అంధత్వ నివారణా సంస్థ చైర్మన్ కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వమిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పక్షోత్సవాల ముగింపులో కెజిహెచ్ సూపరెంటెండెట్ డాక్టర్ పి అశోక్‌కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు. డాక్టర్ విశ్వమిత్ర మాట్లాడుతూ, పక్షోత్సవాల్లో భాగంగా బహిరంగ ప్రదేశాలు, విద్యాలయాల్లో ప్రభుత్వ, స్వచ్ఛందసంస్థల సహకారంతో నేత్రదానంపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు.

నేత్రదానంపై విద్యార్థులకు వక్తృత్వపోటీలను నిర్వహించగా, విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మోహిసిన్ ఐ బ్యాంక్, యంగ్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ తృప్తి, డాక్టర్ రాయ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ బెన్ విక్టర్, డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఎల్‌వి.ప్రసాద్ కంటి హాస్పిటల్, శంకర్ ఫౌండేషన్ కంటిఆసుపత్రి, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పారా మెడికల్ స్టాఫ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కౌన్సిలర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

అన్నసమారాధన

ప్రజాశక్తి -ములగాడ: శ్రీ విజ్ఞాన మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనను 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు, హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ సంస్థ అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వేతనం అడిగితే ఉద్వాసన !

- మధురవాడ ఆర్‌టిసి డిపోలో కాంట్రాక్టు కార్మికురాలి తొలగింపుపై నిరసన
- విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ధర్నా

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి -మధురవాడ: ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం వేతనం చెల్లించాలని వినతిపత్రం ఇచ్చిన కాంట్రాక్టు కార్మికురాలు సొంబారపు పద్మను విధుల్లోంచి తొలగించడం దుర్మార్గమని, తక్షణమే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం దీనిని నిరసిస్తూ మధురవాడ డిపో వద్ద ధర్నా చేశారు.ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ, తొమ్మిదేళ్లపాటు కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేసిన పద్మ తొలగింపు అమానుషమని, సమస్యలపై మిగతా కార్మికులు నోరెత్తకుండా బెదిరింపు చర్యల్లో భాగంగానే ఇటువంటి చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధన మేరకు కార్మికులకు వేతనాలను చెల్లించని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించని డిఎం, ఇలా కార్మికులపై చర్యలకు ఉపక్రమించడం అన్యాయమన్నారు. తక్షణమే తొలగించిన కాంట్రాక్టు కార్మికురాలిని విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించార అనంతరం డిపో మేనేజర్ ఉమ మహేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి కొండమ్మ, పి రాజుకుమార్, డిపో కమిటీ నాయకులు బిఎస్ నారాయణ, ఎస్ భాస్కరరావు, బాధితురాలు ఎస్.పద్మ, ,పి సాగర్, డి భాస్కర్, పి సాయి శ్రీనివాస్, ఎం శివ, అర్ ఆదిలక్ష్మి, టి లక్ష్మి, జి.బంగారమ్మ పాల్గొన్నారు.

'ప్రసాదం' నిధులతో మెరుగైన సౌకర్యాలు

ఆగం పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానంలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ రామచంద్ర మోహన్ అన్నారు. దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద పథకం కింద రూ.55కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైదిక వర్గాల సలహా మేరకు కొండపైన యోగశాల నిర్మిస్తామని, మెరుగైన సౌకర్యాలతో కేశఖండనశాల నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు కొండ దిగువన 36 ఏళ్ల నిర్మించిన పుష్కర సత్రాన్ని తొలగించి ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు ఇందులో రెండు అంతస్తులను దేవస్థానం నిధులతో, మిగతా మూడంతస్తులు ప్రసాదపథకం నిధులతో నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఆగం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆగం పాఠశాలకు వేరేచోట భవనాన్ని నిర్మించి, ప్రస్తుతమున్న భవనానికి మరమ్మతులు చేపట్టి, దేవస్థానం అవసరాలకు కోసం వినియోగిస్తామన్నారు. కొండకు వచ్చే భక్తులకు సరైన పార్కింగ్ కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అనంతరం సింహాద్రి అప్పన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థాన అధికారులు స్వామి ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు మెమెంటోని అందజేశారు. దేవస్థానం ఇఒ వి.త్రినాధరావు పాల్గొన్నారు

విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : కేయాన్ డిజిటల్ తరగతులు ఉపయోగించుకుని అభ్యాసన సామర్థ్యాలను మరింతగా పెంచుకోవాలని భారత్ డైనమిక్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం చిట్టివలస జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ డైనమిక్స్ సంస్థ సమకూర్చిన డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ సంస్థ సహకారంతో విశాఖ, విజయనగరం జిల్లాల్లో అనేక పాఠశాలలకు ఈ తరహా డిజిటల్ తరగతులను ఏర్పాటు చేశామన్నారు. ,వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ, డిజిటల్ విధానంలో బోధన ద్వారా విద్యార్థులకు ప్రతి సబ్జెక్టునూ నేర్చుకోవాలన్న ఆసక్తి పెరుగుతుందన్నారు. స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు జి రవి, డిజిటల్ తరగతుల ప్రాజెక్ట్ నిర్వహణ కోఆర్డినేటర్ రవీంద్ర, హెచ్‌ఎం పొట్నూరు మురళీమోహనరావు, సమగ్ర శిక్ష ఎపిఒ అప్పలనాయుడు పాల్గొన్నారు

సాంకేతిక కాలేజీలో ఓరియంటేషన్

ప్రజాశక్తి -పిఎం పాలెం: మధురవాడ సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 21వ బ్యాచ్ ఇంజినీరింగ్ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారుసిఎస్ఐఆర్, సిఎస్ఐఒ సైంటిస్ట్-జి డాక్టర్ సి.ఘనశ్యామ్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి సాంకేతిక సదుపాయాలను సక్రమంగా వినియోగించుకొని, మరింత అధునాతన ఆలోచన విధానాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌సి.అనిల్ కాలేజీలోని వివిధ ఇంజినీరింగ్ విభాగాలు, ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలు గూర్చి వివరించారు. ఆళ్వార్‌దాస్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుభట్, కోఆర్డినేటర్ ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పద్మనాభం: స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ మండలి చైర్మన్ తాలాడ సూరినాయుడు అధ్యక్షతన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశంలో లేవనెత్తారు. విలాస్‌ఖాన్ పాలెంలో వ్యవసాయ విద్యుత్ సమస్యలపై రైతులు బి అప్పలనాయుడు,ఆర్ ముత్యాలనాయుడు విన్నవించారు. దీనిపై ఇన్‌ఛార్జి విద్యుత్ ఎఇ రమేష్ స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. .నాటుకోళ్ల ఫారాలు పెట్టుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న సంగం రాయితీని సద్వినియోగం చేసుకోవాలనిమండల పశువైద్యాధికారి కె.మహేష్‌కుమార్ సూచించారు. కృష్ణాపురంలో సుంకర నారాయణరావు చెరువుకు చప్టా నిర్మించాలని ఇరిగేషన్ అధికారి వర్మ దృష్టికి ఆ గ్రామ రైతు రాంబాబు తెచ్చారు...విలాస్‌ఖాన్‌పాలెం మరికమ్మ చెరువు కల్వర్టు కట్టాలని. రామశింగు ముత్యాలనాయుడు కోరారు. యూనియన్ బ్యాంకు ఫీల్డు ఆధికారి కిరణ్ మాట్లాడుతూ, పంటరుణాలను సకాలంలో చెల్లించాలని, రైతులకు బ్యాంకు ఇస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి చలం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేటలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని పసుపులేటి రాజబాబు అనే వ్యక్తి మృతి చెందారు. స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద రాజబాబు నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడం తో తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికులు ఘటన స్థలానికి కి చేరుకొని గాయపడిన రాజబాబు రావికమతం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మీ, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు ఇటీవల మృతి చెందారు. కేసును సిఐ కుమారస్వామి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ: పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు వివరాలివి. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కరకాం గ్రామానికి చెందిన మీసాల రమ్య(15) బోయపాలెం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కొద్దిరోజుల నుంచి చదువుకో ఇంట్రెస్ట్ లేకపోవడంతో తోటి విద్యార్థులతో ముభావంగా ఉంటోంది. శుక్రవారం ఉదయం తన హాస్టల్ గదిలో ఫ్యాను హుక్కు కు ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడినట్లు సిఐ తెలిపారు. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ విశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-పరవాడ : జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మసిటీ సింహాద్రి జంక్షన్ వద్ద గురువారం ఇద్దరు వ్యక్తులు అక్రమ గంజాయి రవాణా చేస్తుండగా వారు పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులు పరవాడ మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన జోగా సంజీవరావు (34), అనకాపల్లి జిల్లా రావికమతం మండలం గుడ్డిప గ్రామానికి చెందిన కోడూరు నాగభూషణరావు (29) వద్ద నుండి సుమారు నాలుగు కేజీలు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, జడ్జి 14 రోజులు జుడీషీఎల్ రిమాండ్ విధించారని పరవాడ సిఐ పి ఈశ్వరరావు మీడియాకు తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసులో నిందితునికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : బాలికపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ళ కఠిన కారాగారశిక్షతో పాటు రూ.మూడు వేలు జరిమానా విధిస్తూ పోక్సో కేసుల ప్రత్యేక విచారణ స్థానం న్యాయమూర్తి జి.ఆనందిని శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలనితీర్పులో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివి.

నగరంలోని రేసపువానిపాలెనికి నిందితుడు పలికల శివకుమార్, 2015 మార్చి మద్దిలపాలెంలో ఉంటున్న ఒక బాలికపై ఆమె తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటిలోకి వెళ్లి లైంగిక వేధింపులకు యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చే నిందితునికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధిత బాలిక అన్నయ్య ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నిందితునిపై నేరం రుజువైనందున శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శతాధిక వృద్ధుడు మృతి

సూర్యనారాయణ

ప్రజాశక్తి - పద్మనాభం: మండలంలోని బాందేవుపురం పంచాయతీ విజయరామపురం గ్రామానికి చెందిన 101ఏళ్ల నిండిన శతాధిక వత్సరాల వృద్ధుడు గంగిరెడ్ల సూర్యనారాయణ శుక్రవారం సాధారణంగా మృతి చెందాడు. 1923 జనవరిలో జన్మించిన సూర్యనారాయణ, ఇటీవలే వందేళ్ళ పూర్తి చేసుకున్నాడు. సూర్యనారాయణకుమారుడు గంగిరెడ్ల వెంకటరమణ గ్రామ సర్పంచ్‌గా పనిచేయగా, ప్రస్తుతం ఆయన మనుమరాలు వాజగాని ఆదిలక్ష్మి సర్పంచ్‌గా పని చేస్తున్నారు.

యువత నైపుణ్యాభివృద్ధికి 'సంఘమిత్ర' కృషి అభినందనీయం

వెంకటరెడ్డిని సత్కరిస్తున్న సంఘమిత్ర ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆసక్తి ఉన్న రంగంలో యువత నైపుణ్యాభివృద్ధికి కృషి చేసి, వారు ఉద్యోగం, స్వయంఉపాధిలో స్థిరపడేందుకు సంఘమిత్ర సోషల్ సర్వీసెస్, సంఘమిత్ర మల్టీపుల్ టెక్నికల్ ట్రైనింగ్ అండ్ రీసెర్చి సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకట రెడ్డి అన్నారు శుక్రవారం విశాఖ ఆరిలోవ ప్రభుత్వ జువెనైల్ బాలల నివాసం వద్ద సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సంఘమిత్ర మల్టీపుల్ టెక్నికల్ ట్రైనింగ్ అండ్ రీసెర్చి సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వెల్డింగ్, సోలార్ విద్యుత్ ఇలా విభిన్న విభాగాల్లో సంఘమిత్ర అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని వెంకటరెడ్డి ఆకాంక్షించారు. బ్రహ్మకుమారి సిస్టర్ రమా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డిని సత్కరించారు.

మరణంలోనూ సేవాభావం

ప్రజాశక్తి -ములగాడ: మరణంలోనూ వేరొకరికి కంటిచూపునిచ్చి 61వ వార్డు పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం, పల్లివీధికి చెందిన గొలగాని సురేష్ యాదవ్ ఆదర్శంగా నిలిచాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అయితే తాను బతికుండగానే కళ్లను దానం చేయాలని తల్లిదండ్రులు, కుటుంబీకులను కోరాడు. సురేష్ కోరిక మేరకు అతని తండ్రి గొలగాని అప్పలనాయుడు,తల్లి అప్పలనర్సమ్మ, అన్న శుక్రవారం ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రికి సమాచారమిచ్చి, కళ్లను దానం చేశారు. పుట్టెడు దు:ఖంలోనూ సురేష్, అతని కుటుంబీకులు సేవాభావాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

గరికపాటికి ఘననివాళి

రాజారావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న అరుణ్‌జీ

ప్రజాశక్తి -కరాస :కళాతపస్వి, ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతిని 52వ వార్డు శాంతినగర్ హస్మి భవనంలో ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ నాయకులు అరుణ్ జి ,చంటి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం చంటి, తెలుగు రమణ ఎం నాగేశ్వరరావు, రాగిణి యుటిఎఫ్ జిల్లా నాయకులు అప్పారావు, రాష్ట్ర నాయకులు నాగమణి తదితరులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ వృత్తిని కొనసాగిస్తూ ప్రజల కోసం అనునిత్యం పరితపిస్తూ అనేక నాటికలు, నాటకాలు, కళారూపాల ద్వారా నిత్యం ప్రజా చైతన్యం కోసం గరికపాటి రాజారావు పాటుపడ్డారని వక్తలు కొనియాడారు. సభలో హష్మీ భవన్ డాన్స్ స్కూల్ నృత్య కళాకారుంలు పద్మ రాగిణి , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరిలోవ : డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆరిలోవ లీలా సుందరయ్య కాలనీలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, సీనియర్ నాయకులు వై.అప్పారావు, కవి ప్రసాద్, ఐద్వా నాయకులు రంగమ్మ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అవినీతి!

- మూడో జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ముడుపులిస్తేనే పనులు?
- కార్యాలయంలోనే సెటిల్మెంట్లు చేస్తున్నారని బాహాటంగా విమర్శలు

26వ వార్డులో గెడ్డను ఆక్రమించి అక్రమంగా ఇంటి నిర్మాణం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి మూడో జోన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నీ సక్రమంగా ఉన్నా చేయి తడిపితేనే గానీ అనుమతులు మంజూరు చేయడం లేదని, కార్యాలయంలోనే సెటిల్మెంట్లు చేస్తున్నారని పలువురు నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. ముడుపులిస్తే ఎంతటి అక్రమమైనా ఇట్టే పనులు చేసేస్తున్నారని, ఫిర్యాదుచేసినా స్పందించడం లేదని అధికారపార్టీ నేతలు సైతం విమర్శిస్తున్నారంటే, ఈ విభాగంలో అవినీతి కంపు ఏస్థాయిలో ఉందో ఇట్టే స్పష్టమౌతోంది. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని పలువురు కోరుతున్నారు.

జివిఎంసి మూడో జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉన్నతాధికారుల నుంచి టౌన్ ప్లానింగ్ సెక్రటరీ వరకు అవినీతికి అలవాటు పడి అక్రమనిర్మాణాలను ప్రోత్సాహిస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ప్రతిపనికీ ఒక రేటు పెట్టి, డబ్బులిస్తేనే ప్లానింగ్ అప్రూవల్, లేకుంటే 'నో' అన్న రీతిగా ఈ విభాగం పనితీరు ఉందని పలువురు నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. వందగజాలకు పైబడి భవన నిర్మాణాలకు గజానికి ఇంత అని రేటు పెట్టి, ముడుపులు డిమాండ్ చేయడంతోపాటు, ఎవరైనా ఇవ్వకుంటే నిర్దంద్వంగా అనుమతులు తిరస్కరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై పార్టీలో అంతర్గతంగా జరిగిన సమీక్షలో వైసిపి నేతలు, కార్పొరేటర్లను ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి హెచ్చరించి, పారదర్శకంగా పనిచేయాలని సూచించినట్లు తెలుస్తోంది.

ఒకమంత్రి అండదండలతో జోనల్ కార్యాలయంలోని అధికారి ఒకరు ఆఫీస్‌లోనే సెటిల్మెంట్లు చేస్తున్నారని, ఇది ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని మిగతా అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. గతంలోనూ ఎందరో అధికారులు ఇక్కడ పనిచేసినా, బాహాటంగా కార్యాలయంలోనే సెటిల్మెంట్లు చేసే పరిస్థితి లేదని ఇక్కడి ఉద్యోగులు సైతం తలలు పట్టుకుంటున్నారు. విషయం తెలిసినా ఉన్నతాధికారులు కిమ్మనకుండా ఉండడంపై ఆవేదన చెందుతున్నారు.

అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు

25వ వార్డులో గెడ్డస్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని జాయింట్ కలెక్టర్, టౌన్ ప్లానింగ్ సిసిపి, వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె.రాజుకు స్థానిక వైసిపి కార్పొరేటర్ సారిపల్లి గోవిందుతోపాటు సిపిఐ నేతలు పడాల గోవిందు, సిపిఐ ఉత్తర నియోజకవర్గ నేత నాగభూషణం ఫిర్యాదు చేశారు. గతంలో తహశీల్దార్‌గా శ్యాంప్రసాద్ ఉన్నప్పుడు, ఆక్రమణలను పరిశీలించి, నిలుపుదల చేసినప్పటికీ, కొందరు అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతోనే మళ్లీ పనులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిర్యాదుచేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు అంటున్నారు. ఇక 26వ వార్డు శంకువానిపాలెం రావిచెట్టు వద్ద కొంతమంది వైసిపి నాయకులు సుమారు కోటిన్నర విలువైన గడ్డ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారనే విమర్శలున్నాయి. . ఇక్కడ పది అడుగులు కూడా రోడ్డు లేనప్పటికీ, 30 అడుగులు ఉన్నట్లు చూపించి అనుమతులు పొందారని, అక్రమంగా నిర్మాణం సాగిస్తున్నారని స్థానిక వైసిపి వార్డు అధ్యక్షురాలు పీలా. వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ పోతు సత్యనారాయణ జగనన్నకు చెబుదాం అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, సన్యాసిరావులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుపై వెంటనే స్పందించాల్సిన అధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పందించడం లేదో అంతుపట్టడం లేదని వైసిపి నేతలు అంటున్నారు. జివిఎంసి మూడో జోన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలోఅవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారుల తోపాటు ఎసిబి దృష్టి పెట్టి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జివిఎంసి అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నేతలు(ఫైల్‌ఫోటో)

దీనిపై మూడో జోన్ కమిషనర్ విజయలక్ష్మిని వివరణ కోరగా, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. పరిశీలించాల్సిన అధికారులు ఇప్పటివరకు ఎవరు కూడా రాలేదని సాక్షాత్తు స్థానిక వైసీపీ నాయకులే తెలిపారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ 3 పట్టణ ప్రణాళిక అధికారులపై ఏసీబీ అధికారులు దష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

'జగనన్నకు చెబుదాం'లో జెసి విశ్వనాథన్

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రజా సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 8 నుండి అక్టోబర్ 13 వరకు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జెసి విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం ఆనందపురంలో జగనన్నకు చెబుదాం నిర్వహించి, 33 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సోమవారం స్పందనతో పాటు ప్రతి బుధ, శుక్రవారం మండల కేంద్రాలలో జగనన్న చెబుదాంకార్యక్రమం నిర్వహించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించే దిశగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా సమస్యలకు జవాబుదారీగా రశీదు ఇస్తామన్నారు.బీపీ కల్లాలు రోడ్లు అద్వాన పరిస్థితి, వేములవలస పువ్వులు మార్కెట్ వద్ద ట్రాఫిక్, ఆనందపురం బాలికల హాస్టల్, శ్రమజీవుల కాలనీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, జంగాల కాలనీకి సిసి రోడ్డు గుండం చెరువు సమస్య , జగన్నాధపురంలో భూ పరిహారం చెల్లింపు, పందలపాక ఐటిబిపికి ఇచ్చిన భూములకు నష్టపరహారంచెల్లింపు తదితర సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి.కార్యక్రమంలో జెసి విశ్వనాథన్‌తోపాటు డిఆర్‌డిఎ పిడి శోభారాణి, జెడ్‌పి సిఇఒ శ్రీరామ్‌మూర్తి, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, స్థానిక తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడప లవరాజు పాల్గొన్నారు.

ఇఇగా సింహాచలం నాయుడు

సింహాచలం నాయుడు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ ఒకటో జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బి. సింహాచలం నాయుడు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇఇ సత్యనారాయణ ఉద్యోగ విరమణతో ఖాళీ అయిన స్థానంలో సింహచలం నాయుడు విధుల్లో చేరారు.కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ, తన దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. కార్యాలయంలోనేని ఉద్యోగులు, సిబ్బంది సహకారం, సమన్వయంతో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి : సుమన్

పోస్టరు, ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుమన్

ప్రజాశక్తి -గాజువాక :ఆత్మరక్షణకు కరాటే వంటి కళలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సినీనటుడు సుమన్ తల్వార్ అన్నారు. ఎపి కెన్యూర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న గాజువాక బిసి రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించనున్న 15వ ఎపి స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల పోస్టర్‌ను, ట్రోఫీని ఆవిష్కరించారు.చీఫ్ ఆర్గనైజర్ కోరాడ సుమన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నటుడు సుమన్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు, దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, నష్టం జరిగాక బాధపడే కన్నా ఆత్మరక్షణకు ముందుగా ఇటువంటి యుద్ధకళలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు డి మోదినాయుడు, పి ధనుంజయ్, పి శివప్రసాద్, కె ఉమామహేష్, ఎంకెటి ట్రాన్స్‌పోర్టు అధినేత బొడ్డేటి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

810 హెక్టార్లలో ఖరీఫ్ సాగు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 810 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు సాగులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి బి శివ కోమలి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే ఆన్‌లైన్‌లో పంటల నమోదు చేపడుతున్నట్లు తెలిపారు.

40 శాతం రాయితీ పై డ్రోన్లు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ, ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వరాయితీలను వివరించారు. ఎంపిడిఒ పి.వెంకట రమణ, డిసిసిబి మేనేజర్, ఎఎబి సభ్యులు, ఆర్‌బికె సిబ్బంది భువన ప్రత్యూష, కృపామణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు

అగనంపూడి టోల్‌గేట్ ఎత్తివేయాలని ధర్నా

ప్రజాశక్తి - పరవాడ

అక్రమంగా నడుస్తున్న అగనంపూడి టోల్ గేట్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం లంకెలపాలెంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో టోల్ గేట్ ఉండకూడదని చట్టం ఉందని, ఈ టోల్ గేట్ ఎత్తివేయాలని జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసిందని తెలిపారు. అయినా కేంద్ర బిజెపి ప్రభుత్వం అగనంపూడి టోల్ గేట్‌ను ఎత్తడం లేదన్నారు. ఈ టోల్ గేట్ ఎత్తివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం చూస్తే టోల్‌గేట్ యాజమాన్యంతో లాలూచీ పడుతుందని అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు వారి వ్యాపార వ్యవహారాల పట్ల ఉన్న శ్రద్ధ టోల్ గేట్ సమస్యపై లేదని విమర్శించారు. అనకాపల్లి ఆనందపురం ఆరు లైన్ల రోడ్ పూర్తి అయిన వెంటనే ఈ టోల్ గేట్ను ఎత్తివేస్తామని సుప్రీంకోర్టులో కేంద్ర బిజెపి ప్రభుత్వం తెలిపిందని, ఆరు లైన్ల రోడ్డు పూర్తి అయిన ఈ టోల్ గేట్ ఎత్తకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ టోల్ గేట్ ఎత్తివేయకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఆందోళన చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

మున్సిపల్ కమిషనర్‌గా కొండలరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ కొత్త కమిషనర్‌గా బి.ఎ.కొండలరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలేశ్వరం నగరపంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన కొండలరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన్ను ఇక్కడి సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు. ఇంతవరకు ఎఫ్ఎసి కమిషనర్‌గా పనిచేసిన మున్సిపల్ ఇంజనీర్ వీరయ్య కొండలరావును స్వాగతిస్తూ ఛార్జి అప్పగించారు. ఈ కార్యక్రమంలో మేనేజరు ప్రభాకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమిషనర్ కొండలరావు

మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళా సాధికారతకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బీవీ సత్యవతి పేర్కొన్నారు. అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో గల మహిళలు ఉపకరణాల మంజూరు కొరకు నిధులు కేటాయించాలని పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతమ్మను కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి తన క్యాంపు కార్యాలయం నందు శుక్రవారం జీవీఎంసీ ఏడిపి అధ్యక్షతన మహిళలతో సమీక్ష నిర్వహించడం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళల సాధికారత కోసం చేయూత వంటివి ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.

అన్ని వార్డులకు బిఎల్‌ఎలను నియమించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలోని అన్ని వార్డులకు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి రాజకీయ పార్టీలను కోరారు. డిఆర్‌ఓ ఛాంబర్లో శుక్రవారం ఓటర్ల జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బిఎల్వోలు చేర్పులు తొలగింపులు మార్పులు చేపట్టారని చెప్పారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ వంతుగా సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్, బిఎస్పి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులే సమాజానికి దిక్సూచి

ప్రజాశక్తి-అనకాపల్లి : జర్నలిస్టులు సమాజానికి దిక్సూచి వంటి వారని అనకాపల్లి వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు టి శ్రీనివాసరావు, బి మంగరాజు, కోశాధికారి బి నాగరాజు పేర్కొన్నారు. వాసవి క్లబ్ వారోత్సవాల సందర్భంగా జర్నలిస్టుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం రాత్రి వైఎంవిఏ హాలులో పలువురు జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాలను నిర్భయంగా వెలికి తీసేలా వార్తలు రాయలన్నారు. జర్నలిస్టులు దేవకి, అజయ్, భాస్కర్‌రావు, భాను, వీరబాబు, పి శ్రీనివాస్, శ్రీనివాసరావులను సత్కరించారు. వాసవి క్లబ్ ప్రతినిధులు కెవి సత్యనారాయణ, కే కోటేశ్వరరావు, కటకం లక్ష్మణరావు, సిద్ధి లింగేశ్వర ఆలయ ఛైర్మన్ నుదురుపాటి తాతాజీ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -కశింకోట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 4 లక్షల కుటుంబాలు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి న్యాయం చేయలని ఎపి కల్లు గీత కార్మికులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు డిమాండ్ చేశారు. 2020 నుండి గీత కార్మికులకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గీత, కొబ్బరి దింపుడు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర బిసి యాత సాదిరికత కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు మాట్లాడుతూ తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన గీత కార్మికుడు కుటుంబానికి ప్రమాద బీమా అందజేయన్నుట్లు చెప్పారు. కల్లు గీత సొసైటీ అధ్యక్షుడు దుంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఆరునెలల సంపాదించి మిగిలిన నెలలో కొబ్బరిబోండాలు ఊరు ఊరంతా తిరుగుతూ అమ్ముకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉత్తమ టీచర్ రమణికి సన్మానం

ప్రజాశక్తి-చోడవరం : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన చోడవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) ఉపాధ్యాయరాలు పివి.రమణిను మండల విద్యాశాఖ, పాఠశాల పేరెంట్స్ కమిటీ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ యన్.జయలక్ష్మి మాట్లాడుతూ అకుంఠిత దీక్ష, క్రమశిక్షణ, నిత్య విద్యార్థి లక్షణాలు కలిగిన రమణికి అవార్డు రావడం మన మండలానికి గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐవి.రామిరెడ్డి, మండల విద్యాశాఖ సిబ్బంది నాయుడు, సుబ్రహ్మణ్యం, శిరీషా, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

రిషితను అభినందిస్తున్న పాఠశాల ఛైర్మన్ తదితరులు

యోగా పోటీల్లో సాయి విద్యా విహార్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో గల శ్రీసాయి విద్యా విహార్ స్కూల్ విద్యార్థిని ముమ్మిన రిషిత ఆలిండియా యోగ అసైన్డ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు స్కూల్ ఛైర్మన్ దాట్ల అప్పలరాజు శుక్రవారం రుషితను అభినందించారు. ఈనెల 1, 2, 3 తేదీలలో బెంగళూరు వారు నిర్వహించిన ఆల్ ఇండియా యోగ అసైన్డ్ పోటీల్లో 8 నుండి 10 సంవత్సరాల విభాగంలో రిషిత పాల్గొని ప్రథమ స్థానం సాధించింది. ఈమెను ఆ స్కూల్ ప్రిన్సిపాల్ దేవి దత్తు, యోగా టీచర్ పుల్లేటి సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి అభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా కార్యాచరణ చేపట్టామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. స్థానిక విజయరామరాజుపేటలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. స్థానిక సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వికలాంగులు మంత్రి అమర్నాథ్ను తమకు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. వైద్యం కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరగా, మంత్రి వారికి హామీ ఇచ్చారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఇటీవల రాంచీలో నిర్వహించిన నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో ఫస్ట్ ప్లేస్ సాధించిన వంశీని మంత్రి అమర్నాథ్ అభినందించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నాయకులు జాజుల రమేష్, ఉగ్గిన అప్పారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'టిడిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం లోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు అన్నారు. స్థానిక దుర్గాదేవి ఆలయంలో బుచ్చయ్యపేట క్లస్టర్ బి పరిధిలోని బిఎల్‌ఏలు, యూనిట్ ఇన్చార్జిలు, ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే మహిళ సంక్షేమం కోసం పెద్దపీట వేస్తారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు డొంకిన అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ, సాయం శేషు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత బత్తుల తాతయ్యబాబు

పౌష్టికాహారం, పారిశుధ్యంతోనే ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం, పారిశుధ్యం నిర్వహణ, శారీరక శ్రమ, తగిన వైద్యం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టణ శెట్టి చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష, పోషణ్ అభియాన్, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాలకు సంబంధించి ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్య శాఖలు సమన్వయంతో ఈ నెల నుండి పై మూడు కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అమలు జరపాలన్నారు. ప్రజలందరికీ ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు, గర్భిణులకు అవసరమైన టీకాలను వేయాలని ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ శాఖలు పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ.హేమంత్, డీఈవో వెంకట లక్ష్మమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఎఫ్ఎం సర్టిఫికెట్ మంజూరు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

'ఎఫ్ఎం సర్టిఫికెట్ కోసం ఎదురుచూపులు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 6వ తేదీన ప్రచురించిన వార్తకు బుచ్చయ్యపేట రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని రాజాం గ్రామానికి చెందిన కల్లపల్లి గౌరమ్మకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. గౌరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమై ఉంది. గౌరమ్మ సోదరి అయిన అదే గ్రామానికి చెందిన నాగులపల్లి సత్యవతి మృతి చెందగా, వైద్యం నిమిత్తం సత్యవతి పేరుతో రాజాం కెనరా బ్యాంకులో ఉన్న రూ.15వేలు తీసుకోవడానికి అవసరమైన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం జూలై నెల 1వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే అధికారులు రెండు నెలలుగా పట్టించుకోలేదు. సర్టిఫికెట్ మంజూరు చేయకపోవడంతో అనారోగ్యంతో మంచంపైనే గౌరమ్మ ఉండడంతో ఈ సమస్యపై ప్రజాశక్తి కథనం ప్రచురించింది. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి 7వ తేదీన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేసి, 8న శుక్రవారం బాధితురాలు కల్లపల్లి గౌరమ్మకు అందజేశారు.

ఆదివాసీ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చోడవరం : అఖిలభారత ఆదివాసీ సదస్సు వాల్ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ పైలా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మరిసా సతీష్, కెంబూరి కల్పన, ఏఐఎఫ్‌టియు నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, మరిసా నరేష్, కాకర కాంతం తదితరులు పాల్గొన్నారు.

ఖాతా నుంచి నగదు మాయం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట స్టేట్ బాంక్ అఫ్ ఇండియాలో ఉన్న తన ఖాతా నుండి నగదు మాయమైందని చింతపాక గ్రామానికి చెందిన సలాది పైడినాయుడు శుక్రవారం బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. తన ఖాతా 37835967022 నుండి ఆగస్టు 7వ తేదీన రూ.10వేలు, 8వ తేదీన రూ.3500 విత్‌డ్రా చేసినట్లు తెలిపారు.

పోలమాంబ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో రెల్లి కులస్తుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రెల్లి సంఘం నాయకులు వడ్డాది కోటేశ్వరరావు, భూపతి కోటేశ్వరరావు, భూపతి అప్పలరాజు తదితరుల ఆధ్వర్యంలో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న ఆలయం స్థానంలో కొత్తగా పోలమాంబ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు, జనసేన మండల నాయకులు కుంచా అంజిబాబు, సూరిశెట్టి ఉమా మహేష్, మజ్జి ఈశ్వరరావు, శివ, మల్లు నాయుడు, నరేష్, గణేష్, శ్రీను పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థుల సమస్యలు పట్టవా?

ప్రజాశక్తి -అనకాపల్లి : మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ సత్యవతమ్మకు అనకాపల్లి జిల్లా విద్యార్థుల సమస్యలు పట్టవా అని ఉత్తరాంధ్ర చర్చావేదిక నాయకులు బుద్ధ రాజేష్ ప్రశ్నించారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జివిఎంసికి ఎన్నికలు జరిగి మూడేళ్లు అవుతున్నా అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లేందుకు విద్యార్థులకు బస్సు పాస్ పొడిగించలేదని తెలిపారు. దీనివలన అనకాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు బస్సు పాస్ సౌకర్యం లేక చాలా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే శాఖ కూడా పాసింజర్ రైళ్లు మొత్తం రద్దు చేశారని, ఈ కారణంగా ఆర్టీసీ చార్జీలు భారీగా పెరగడం వల్ల విద్యార్థుల జేబులు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. తక్షణమే విద్యార్థులకు అనకాపల్లి నుండి పాసులు ఇవాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న ముఠా కార్మికులు

కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. స్థానిక దుర్గమాంబ ముఠా కళాసి సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు పిలుపు మేరకు శుక్రవారం అన్ని మండలాల్లో కార్మికులతో సమావేశాలు నిర్వహించి సంతకాలు సేకరణ చేసినట్లు తెలిపారు. కార్మికుల నుండి సంతకాల సేకరణ చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు కలిసి వినతిపత్రంలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, ముఠా కళాసి సంఘ అధ్యక్షులు బర్ల రమణ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- చోడవరం : మాలమహానాడు నాయకురాలుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చెయ్యాలని, లేకుంటే సోమవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడి చేపడతామని మాల మహానాడు నాయకులు హెచ్చరించారు. శుక్రవారం స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో జిల్లా మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మాలమహానాడు నాయకురాలపై హత్య చేయడానికి వెళ్ళి, కులం పేరుతో తిట్టి కొట్టిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సియ్యాద్రి శ్రీనివాసరావు, వేచలపు ప్రకాష్, బోని గణేష్, మరువడ ఈశ్వరరావు, చోడవరం గ్రామం సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనకాపల్లి : విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా సర్వసభ సమావేశం శుక్రవారం రైతు భారతి కళ్యాణ మండపంలో జరిగింది. ఇందులో సంఘం అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా మత్తుర్తి గంగారావు, జిల్లా గౌరవ అధ్యక్షులుగా పెద్దపాటి గోవిందరావు, ప్రధాన కార్యదర్శి చేబోలు సూరిబాబు, కోశాధికారిగా ఒంగోలు ఆచారి, పది మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేపూరి రామస్వామి ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పి చంద్రశేఖర్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి జేజే బాబు, రాష్ట్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొడులపాటి ఉమామహేశ్వరరావు, నాగులకొండ శేషు ఆచారి, పట్టణ గౌరవ అధ్యక్షులు కోసూరు మన్మధరావు, పట్టణ అధ్యక్షులు కోటిపల్లి జేజబాబు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కశింకోట : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళ సమాఖ్యలో సెక్రటరీ తోటాడ లక్ష్మికి డ్వాక్రా మహిళలు ఆర్థిక సాయం చేశారు. లక్ష్మికి రెండు కిడ్నీలు ఫెయిల్ అవ్వటంతో విషయం తెలుసుకున్న మండలంలోని డ్వాక్రా మహిళలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. ఈ విధంగా సేకరించిన రూ.73 వేలును కశింకోట మండల సమాఖ్య సమావేశంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. అనారోగ్యంతో ఉన్న లక్ష్మికి సహాయం అందించడంపై ఎంపిపి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు కె.అరుణ, కోశాధికారి అప్పలనర్సమ్మ, ఏపిఎం ఎస్ శ్రీనివాసరావు, సీసీలు, గ్రామ సంఘాల ఓబిలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపిపి కలగా లక్ష్మి

రేషన్ సరఫరాలో కందిపప్పు మాయం

ప్రజాశక్తి - యలమంచిలి : ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు సరఫరా చేయాల్సిన కందిపప్పు కొన్ని నెలలుగా అందడం లేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకుల్లో భాగంగా కిలో కందిపప్పు ప్రభుత్వం రూ.67 సరఫరా చేయాల్సి ఉండగా కొంతమందికి ఆరు నెలలుగాను, మరి కొంతమందకి 3 నెలలుగాను సరఫరా చేయడం లేదని కార్డుదారులు వాపోతున్నారు. మార్కెట్లో కందిపప్పు ధర రూ.150 పలుకుతుండడంతో పేదలకు భారంగా మారింది. పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఇటువంటి సమయంలో పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రేషన్ సరుకుల్లో కోత విధించి సామాన్యుల్ని ఇబ్బందులు పెడుతున్నారు. సరుకులు సక్రమంగా అందించడంలో దాటవేత ధోరణి అవలంబించడం శోచనీయం. మండలం మొత్తానికి 21,000 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. కార్డులో పేర్కొన్న ఒక్కో సభ్యునికి 5కేజీలు బియ్యం ఉచితంగా ఇస్తున్నారు. పంచదార, ఉప్పు, గోధుమపిండి, అగ్గిపెట్టెలు ప్రభుత్వం పేర్కొన్న ధరలకు సరఫరా చేస్తున్నారు. కందిపప్పు అందించడంలో మాత్రం ప్రభుత్వం విఫలమైందంటున్నారు.

సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరరావు వివరణ

కొన్ని నెలలుగా కార్డుదారులు సరిగా కందిపప్పు కొనుగోలు చేయడం లేదు. మిగిలిపోతున్న కందిపప్పు నిల్వ చేసే సదుపాయం తమ వద్ద లేకపోవడంతో సరుకు పాడై డీలర్లు నష్టపోతున్నామంటున్నారు. ఆ కారణంగా వారు కందిపప్పు విడిపించడానికి ఆసక్తి చూపడంలేదు. అందుకే కొన్ని నెలలుగా కేవలం 25 శాతం కార్డుదారులకే కందిపప్పు సరఫరా చేస్తున్నాం. డిమాండ్‌ను బట్టి రానున్న రోజుల్లో అందరికీ సరఫరా చేస్తాం. యలంమంచిలి మండలంలో సెప్టెంబరు నెలలో కందిపప్పు సరఫరా చేయలేదు. రానున్న నెలలో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుంది.

దేశాభివృద్ధికి అక్షరాస్యత అవసరం

ప్రజాశక్తి -ములగాడ : దేశాభివృద్ధికి, ప్రజల సాధికారతకు అక్షరాస్యత ఎంతో అవసరమని ఆంధ్ర విశ్వవిద్యాలయ సోషల్ వర్క్ విభాగాధిపతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. హరినాథ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఆంగ్ల విభాగం నిర్వహించిన అక్షరాస్యతా సదస్సులో మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి, చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి, సంఘసంస్కరణలకు అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపి.ని. భాగ్యలక్ష్మి, సిస్టర్ జయశీల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వై. అనసూయదేవి, వి. అంజలీదేవి, ఎ.సంధ్యారాణి, ఎన్.నదియా, రోజా, ప్రేమలత, ప్రియా, అబీద, జ్యోత్స్న పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఇ.ఫ్లోరా మాట్లాడుతూ మాట్లాడుతూ సగటు వ్యక్తి విలువను పెంచడంలో అక్షరాస్యత, ఉన్నతమైన విద్య ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టి థియఫిలస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాల్సన్ పాల్గొన్నారు

అనకాపల్లి : అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కస్పావీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చదువుల తల్లి సరస్వతి అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఐదుగురు విజేతలకు 82వ వార్డు సచివాలయ సెక్రటరీ బి.దుర్గాదేవి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం, ఉజ్జి సత్యనారాయణ, వినకోట నీలేశ్ గుప్తా, రొబ్బి మల్లేశ్వర రావు, పట్నాల కృష్ణ మోహన్, హెచ్ఎం అల్లాడ శ్యాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ పైనుండి పడి వలస కార్మికుడు మృతి

బాధితుని కుటుంబానికి పరిహారం చెల్లించాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి అచ్యుతాపురం

అచ్యుతాపురం మండలం కుమారపురం గ్రామంలో నాలుగు అంతస్తుల అపార్ట్మెంట్ మేడపై నుంచి శుక్రవారం ప్రమాదవశాత్తు కింద పడి ఒడిశా రాష్ట్రం, మల్లీపూర్ గ్రామానికి చెందిన వలస కార్మికుడు మాలిక్ మనోజ్ (28) మృతి చెందారు. మనోజ్‌కు భార్య, పాప ఉన్నారు. ప్రమాద సంఘటన స్థలాన్ని శుక్రవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనోజ్ మృతిపై విచారణ జరిపించాలన్నారు. ఆయన కుటుంబానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. వలస కార్మికులు ఏదో ఒక రూపంలో ప్రాణాలు కోల్పోతున్నారని, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులు నివసిస్తున్న షెడ్యూల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

మాలిక్ మనోజ్ (ఫైల్)

కవిత అగ్రి ఫాం అధినేత చెబుతున్నవన్నీ అబద్ధాలే

ప్రజాశక్తి-దేవరాపల్లి

కవిత అగ్రి ఫాం అధినేత అప్పారావు చెబుతున్నవన్నీ అబద్ధాలేనని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న తెలిపారు. శుక్రవారం వెంకన్న స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని తారువ, వాకపల్లి రెవెన్యూలో కవిత అగ్రి ఫాం పేరిట 66 ఎకరాలు కొనుగోలు చేశారని, అందులో 33 ఎకరాలకు పైబడి దేవాదాయ శాఖ సంబంధించిన భూములున్నాయని గతంలో రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు స్పష్టంగా తెలియజేశారని గుర్తు చేశారు. తప్పుడు రికార్డులు తయారు చేసి కొనుగోలుదారులను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మారేపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 115లో 23.15 ఎకరాలు దేవుడు మాన్యం భూములని, వాటిని అమ్మకాలు, కొనుగోలు ఎవరు చేసినా తీవ్రంగా నష్టపోతారని దేవాదాయ శాఖ అధికారులు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భూములను 22ఎ 1సి చేర్చాలని విజయవాడ దేవాదాయ శాఖ కమిషనరేటుకు రాయడం జరిగిందని తెలిపారు. గతంలో ఈ సర్వే నెంబర్లు భూముల్లో రెవెన్యూ అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ భూములను ఎవరూ కొనుగోలు చేయొద్దని ప్రజలను వెంకన్న విజ్ఞప్తి చేశారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఆటో డ్రైవర్లు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో లక్షలాదిమందికి రవాణా రంగం ద్వారా సేవలు అందిస్తున్నారన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కులాలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను బ్యాంకుల నుండి ప్రభుత్వం అందించేదని, ప్రస్తుతం జగన్ రెడ్డి ప్రభుత్వం ఈ రుణాలు పొందే అవకాశం లేకుండా చేసిందని విమర్శించారు. సమావేశంలో కాయల ప్రసన్న లక్ష్మి, ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామానాయుడు

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రంలోని వైసిపి దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని కాశీపురం గ్రామంలో శుక్రవారం ఆయన చంద్రబాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ అనే నినాదంతో కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలకు అందించనున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోకి కంపెనీలు రాకుండా చేసి యువతకు ఉపాధి దెబ్బతీసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు శరకాన సూర్యనారాయణ, సోమిరెడ్డి గోవింద, గంధం జగన్నాథం, పూడి సత్యారావు, పెంటకోట అప్పలనాయుడు, లింగాలు, అంజి, మాజీ ఎంపిటిసిలు సర్పంచులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎఎస్ఐ రమణ మృతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న జిబివి.రమణ అనారోగ్యంతో ఆయన స్వగ్రామం సాలపువాని పాలెంలో శుక్రవారం మతి చెందారు. చోడవరం సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పోలీస్ లాంచనాలతో అంత్యక్రియలు జరిగాయి.

జిబివి.రమణ (ఫైల్‌ఫోటో)

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి-అనకాపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జోనల్ కమిషనర్ వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ సెవెన్ 83 వ వార్డు భీమిని గుమ్మం అరుంధతి నగర్ ఏరియాలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే ప్రోగ్రాం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు, జ్వరాలు, డెంగ్యూ మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఒహెచ్ రజిని, ఎస్ఎస్ రవికుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, మలేరియా ఇన్స్పెక్టర్ గణేష్, సెక్రెటరీలు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : పంటలకు ఈ -క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.భాస్కరరావు అన్నారు. మండల వ్యవసాయ సలహామండలి సమీక్ష సమావేశం భాస్కరరావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక సమావేశ మందిరంలో జరిగింది. ఖరీఫ్ సాగు ప్రణాళిక, సమగ్ర పంట సస్యరక్షణ యాజమాన్య పద్ధతుల గురించి సమావేశంలో వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, రాయితీలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిఈవోలు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామ పోలింగ్ స్టేషన్‌ను ఎలమంచిలి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జ్ఞానవేణి శుక్రవారం పరిశీలించారు. ఇటీవల అచ్యుతాపురంలో జరిగిన ప్రజాప్రతినిధుల సమావేశంలో మండలంలో నూతన పంచాయతీలుగా ఏర్పాటైన గొల్లలపాలెం, రామగిరి గ్రామాలకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దానిలో భాగంగా ఆమె వాడ్రాపల్లి సమీప గొల్లల పాలెం గ్రామ పోలింగ్ స్టేషన్ అనువైన భవనం కోసం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, డిప్యూటీ తాసిల్దార్ వినయ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రం కోసం పాఠశాలను సందర్శించిన జ్ఞానవేణి

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి

ప్రజాశక్తి-కోటవురట్ల:గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా జగన్ అన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి అన్నారు. శుక్రవారం నాతవరం మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 178 మంది వారి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా మండలంలో భూ సమస్యలు, భూమి పట్టాలు, ఇళ్ల పట్టాలు, తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని, తాండవ రిజర్వాయర్ నుంచి నీరు వృథాగా పోతుందని పలువురు కోరారు. లేట రైట్ అనుమతులు రద్దు చేయాలని సిపిఎం నాయకులు అడిగర్ల రాజు . వినతి పత్రాలు అందజేశారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

కాపులకు బిసి సర్టిఫికెట్లు అందజేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నర్సీపట్నంలో సాగునీటి ఇంజనీరింగ్ కార్యాలయాన్ని కొనసాగించాలని నాతవరం ఎంపీపీ వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా, మండల స్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జాహ్నవి, ఏ ఎస్ పి అది రాజ్ సింగ్ రాణా, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ రాజ్, ఆర్డీవో వెంకట జయరాం, డిపిఒ శిరీష రాణి, తహసిల్దార్ శ్రీనివాస్ నాయుడు, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

10న వేడుకోలు దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఒప్పంద పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సమగ్ర శిక్ష సొసైటీలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు ఈనెల 10న వేడుకోలు దీక్ష చేపట్టనున్నారు. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లా కేంద్రంలో నెహ్రూ చౌక్ వద్ద జిల్లాలో పనిచేస్తున్న సుమారు 900 మందితో వేడుకోలు దీక్ష చేయుటకు జిల్లా నాయకత్వం పిలుపు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నర్సీపట్నం మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకొని స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండలంలో పని చేస్తున్న అన్ని విభాగాల సమగ్ర శిక్ష ఒప్పంద, పొరుగు సేవలు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఏ. వరహాల నాయుడు(పి టి ఐ), జనరల్ సెక్రెటరీ ఎన్. రమేష్ పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ఉట్ల సంబరం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా ఉట్ల సంబరం

ప్రజాశక్తి-నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా ఉట్ల సంబరం జరిగింది. ప్రతీ ఏటా కృష్ణాష్టమి వేడుకలను ఆలయంలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. గ్రామానికి చెందిన పెండ్యాల పెంటారావు ఉట్టి కొట్టారు.అనంతరం గోదాదేవి అమ్మవారి తిరు వీధి సేవ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమా చార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, పెండ్యాల పెంటారావు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని దేవవరం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన కారు ప్రమాదం త్రుటిలో తప్పింది .విశాఖపట్నం నుండి తుని వైపు వెళ్తున్న కారు దేవవరం జంక్షన్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు భాగం, గ్రిల్స్ దెబ్బతిన్నాయి.

దెబ్బ తిన్న కారు

వెంకటలక్ష్మికి ఘన సత్కారం

ప్రజాశక్తి -చీడికాడ:ఆదర్శ పాఠశాలకి అనంతి కాలంలోనే రాష్ట్రంలోని ఉత్తమ స్కూల్‌గా గుర్తింపు తెచ్చిన ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మిని మండల టీచర్స్ యూనియన్ సంఘాలు సత్కరించాయి. చీడికాడ మండలంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా వచ్చిన సిహెచ్ వెంకటలక్ష్మి అనంతకాలంలోనే పాఠశాలకి అవార్డు పొందేటట్టు చేయడం ఎంతో గర్వకారణమని పిఆర్‌టియు, ఎస్టియు, టీచర్ సంఘాల నేతలు కొనియాడారు. ఆమెను ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరదేశి మాస్టర్ మాట్లాడుతూ, ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు కూడా రావడం చాలా ఆనందమని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కొనియాడారు. ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, తోటి సిబ్బంది తనకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు

సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పరదేశి, పిఆర్‌టియు మండల అధ్యక్షులు కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్, దూది శ్రీనివాస్, ప్రసాద్ మాస్టర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రేబాకలో రైడ్ అండ్ రైజ్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయురాలు వి.హనీ అవినాష్‌కు తోటి ప్రైవేట్ ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనీ అవినాష్‌ను ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక చేసి విశాఖపట్నంలో పురస్కారాన్ని అందజేశారు.శుక్రవారం రేబాక ప్రైవేట్ స్కూల్లో ప్రైవేట్ ఉపాధ్యాయులు సకలా నాగేశ్వరావు ఆధ్వర్యంలో హనీ అవినాష్‌కు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యా యులు గౌరి, మానస, అనూష, మంగ, వరలక్ష్మి, దేవి, వరలక్ష్మి, రామలక్ష్మి, ఆశ, నిర్మల, బర్నాని పాల్గొన్నారు.

అభినందనలు తెలుపుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ

జగనన్న ఆరోగ్య సర్వేపై అవగాహన

ప్రజాశక్తి- చీడికాడ:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జగనన్న ఆరోగ్య సర్వేపై మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహించాలని ఎంపీడీవో జయప్రకాష్ ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విస్తరించకుండా తక్షణమే సంబంధిత అవసరమగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్యశాఖ అధికారులు డి.అప్పారావు నాయుడు, డాక్టర్ సునీల్, మండల ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హాజరైన గ్రామస్తులు

చెట్టుపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్: మండలంలోని చెట్టుపల్లి పంచాయతీలో సామాజిక తనిఖీ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ గజాల నాగరత్నం మాట్లాడుతూ, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం రమణ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు గ్రామాలకు ఉపయోగపడుతున్నాయని, కల్లాలు ఎత్తు చేసుకొనే పనులు చేపట్టాలన్నారు. వచ్చే సంవత్సరంలో చెట్టుపల్లి పంచాయతీలో రూ.2 కోట్లుతో పనులు చేయాలని కోరారు. ఈ గ్రామ సభలో గ్రామ పెద్దలు గజాల సూరిబాబు, దండిన నానాజీ, పరవాడ సముద్రాలు, ఏపిఒ నానిబాబు, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

చివరి దశలో..చిగురిస్తున్న ఆశలు

- వారం రోజులుగా వర్షాలు
- అదునుదాటినా సాగుకు రైతులు సన్నద్ధం

కుముందానుపేటలో దుక్కు దున్నుతున్న రైతు

వరి పొలంలో చేరిన నీరు

ప్రజాశక్తి- వడ్డాది: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురి స్తున్నాయి. ఇటీవల కాలంలో వర్షాభావంతో వరి పంటలు వేయలేక ఆశ నిరాశగా మారింది. ఈ సీజన్లో వరి విత్తనాలు నారు మడులు తయారుచేసి రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో సాగు పనులు చేపట్టడం మానుకున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాల కారణంగా రైతుల్లో మళ్ళీ ఆశలు చిగురించింది. వరి పంటలు ఆలస్యం అయినప్పటికీ బంగారు మెట్ట, ఎల్బీపీ అగ్రహారం, వడ్డాది, లోపూడి, చిన్నప్పన్నపాలెం, పొట్టిదొర పాలెం, మంగళాపురం, కుముందానుపేట, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో వరి నాట్లు మొదలుపెట్టారు. నీటి ప్రాంతాల్లో ముందుగా వారినాట్లు వేసినప్పటికీ చెరువుల్లో నీరు లేక రైతులు నిరాశ చెందారు. చాలా మంది రైతులు వరి నారు మళ్ళు దమ్ములు తయారు చేసి నీరు లేక వాటిని అలానే ఉంచేశారు. కానీ కొంతమంది రైతులు వేరే మార్గం లేక మళ్ళీ ఇటీవల కురుస్తున్న వర్షాలతో వరి నాట్లను ఆరంభించారు.

కోటవురట్ల:తీవ్ర వర్షం బావ పరిస్థితి ఎదుర్కొంటున్న మండలంలో బుధ, గురు వారాలు కురిసిన తేలికపాటి వర్షానికి మండలంలో మందకొడిగా వరినాట్లు కొనసాగుతున్నాయి. ప్రధానంగా వరాహ, సర్ప నదులు నేటికీ పూర్తిస్థాయిలో ప్రవహించక పోవడంతో ఆయా ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా తాండవ నీరు పూర్తిస్థాయిలో మండలానికి చేరుకోక పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తాండవ కాలువ ఆయకట్టు రైతులు సరుగుడు సాగుకై మొగ్గు చూపుతున్నారు.

కోటవురట్లలో నాట్లు వేస్తున్న రైతులు

బ్రాంచిని ప్రారంభిస్తున్న రాంబాబు

ఎండాడలో ఇండియన్ బ్యాంక్ బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ బ్యాంక్ తన 49వ బ్రాంచిని శుక్రవారం ఎండాడలో ప్రారంభించింది. ముఖ్య అతిథిగా హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్ డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్‌వి.రాంబాబు హాజరయ్యారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సిహెచ్.వెంకట రమణరావు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌కు బ్యాంకుతో ఉన్న సంబంధాన్ని వివరించారు. వెంకట రమణరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో తమ వ్యాపారం రూ.9600 కోట్లు దాటినట్లు ప్రకటించారు. ఈ జోన్ బ్యాంకింగ్‌లో అన్ని ప్రామాణికతలలో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. బ్యాంకు పురోగతిని వివరించారు. ఎండాడ బ్రాంచి మేనేజర్ సిహెచ్.సతీష్ ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది.

కవగుంట భూములపై విచారణ

-'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

-రికార్డుల పరిశీలన

-నేడు రైతులతో సమావేశం కానున్న తహాశీల్దార్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని రావికమతం మండలం కవగుంట భూముల రీ సర్వేలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రజాశక్తి రెండ్రోజుల పాటు ఇచ్చిన కథనాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. సాగులో వున్న రైతులను గుర్తించాలని సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒలను ఆదేశించారు. ఈ నెల 5న 'కవగుంటలో గిరిజనుల భూములకు ఎసరు', 7న 'రీ సర్వేలో పేర్లు తారుమారు' శీర్షికన రెండు కథనాలొచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనాలపై తహాశీల్దార్ ఉమామహేశ్వరరావు చర్యలు ప్రారంభించారు. రికార్డులన్నీ పరిశీలించారు. ప్రాథమికంగా రీ సర్వేలో జరిగిన పొరపాట్లను ఆయన గుర్తించినట్లు తెలిసింది. శనివారం కవగుంట వెళ్లి గిరిజన, పేద రైతుల నుంచి వివరాలు సేకరించనున్నారు. తరువాత గ్రామసభ నిర్వహించనున్నారు. విచారణ పూర్తిచేసి నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నారు. రీ సర్వేలో గిరిజనులు, పేదలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని, తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్ ఉమామహేశ్వరరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

స్థాయీ సంఘంలో అన్ని అంశాలూ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయి సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయి సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 22 అంశాలు, 7 టేబుల్ అజెండాలు వెరసి 29 అంశాలను పొందుపరిచగా అన్నీ ఆమోదం పొందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.660.27 లక్షల పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి సుమారు రూ.119.02 లక్షలకు ఆమోదం తెలిపారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు, పొడిగింపులతోపాటు తదితర అంశాలకు ఆమోదం లభించింది. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి (రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు బొడ్డేపల్లి రాము, విజయలక్ష్మి, ఎస్‌వి.రమణ, పర్యవేక్షక ఇంజినీర్ ప్రసాద బాబు, కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషి పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

ఆదర్శమూర్తి పావెల్

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిపిఎం విశాఖ జిల్లా సీనియర్ నాయకులు, ప్రముఖ ఆర్టిస్ట్ పావెల్ అందరికీ ఆదర్శమూర్తి అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. పిఠాపురం కాలనీలో ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయంలో పావెల్ తృతీయ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. నర్సింగరావుతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పావెల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పావెల్ కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి నిబద్ధతతో పనిచేశారన్నారు. ఆయన ఆర్టిస్ట్‌గా పార్టీ అఖిల భారత మహాసభలు, రాష్ట్ర మహాసభలు ఎక్కడ జరిగినా అక్కడకు వెళ్లి సేవలందించారన్నారు. ఆయనకున్న సమర్థతకు ఎన్నో అవకాశాలు వచ్చాయని, వాటిని వదులుకొని పార్టీకి ఎనలేని సేవ చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగిన పోరాటాల్లో ముందుండేవారన్నారు. ఆయన అనేక మందికి శిక్షణ ఇచ్చి ఆర్టిస్ట్‌లుగా తయారు చేసి ఉపాధిని కల్పించారన్నారు. ఆయన మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, కుమార్, పద్మ, ఈశ్వరమ్మ, కెఎం.శ్రీనివాస్, జగన్, సీనియర్ నాయకులు చలపతి, జ్యోతీశ్వరరావు, కుమార్‌మంగళం, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పంచకర్ల సందీప్
జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్

శేఖరి శ్రీనివాస్
జనసేన నాయకులు భీమిలి నియోజకవర్గం

కురిమిన రామస్వామినాయుడు
మండల జనసేన నాయకుడు, అయినాడ, పద్మనాభం

పద్మనాభం మండలం, విశాఖ జిల్లా.

విద్యుత్ కోతలపై ఆరా

-'ప్రజాశక్తి' కథనానికి స్పందన

-పొలాలకు వెళ్లి రైతుల నుంచి వివరాల సేకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి:'విద్యుత్ కోతలతో రైతుకు తిప్పలు' శీర్షికన శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై అనకాపల్లి డివిజన్ విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. మునగపాక, తిమ్మరాజుపేట పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి కరెంట్ కోతలపై వివరాలు అడిగి తెలుకున్నారు. కరెంట్ కోతలతో వరి పొలాలకు నీరు పెట్టలేకపోతున్నామని విద్యుత్ శాఖాధికారులకు రైతులు వివరించారు. కరెంట్ కోతలు లేకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారని 'ప్రజాశక్తి'కి రైతులు తెలిపారు. విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయడంతో పాటు విద్యుత్ సరఫరా సమయం 9 గంటల నుంచి 12 గంటలకు పెంచాలని రైతులతో కలిసి ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు వినతిపత్రం అందజేశారు.

జైళ్ల శాఖ జాతీయ సదస్సుకు సన్నాహాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే జైళ్ల శాఖ 8వ జాతీయ సదస్సుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. ఆజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగా రాష్ట్ర జైళ్ల శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో సాగరతీరం సాయిప్రియ హోటల్‌లో నిర్వహించే జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల జైళ్ళశాఖ అధిపతులు 150 మంది వరకు హాజరు కానున్నారు. ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి అజయ్ కుమార్ మిశ్రా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం విశాఖ కేంద్రకారాగారంలో 50 మంది అధికారులతో నిర్వాహక కమిటీతో సమావేశమయ్యారు. సదస్సు విజయవంతానికి కృషి చేయాలని సభ్యులకు సూచిస్తూ, తగు సూచనలు చేశారు. జైళ్ల శాఖ సదస్సులో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తామని, పరివర్తన్ మేగజైన్ ఆవిష్కరణ, వివిధ జైళ్లలో ఖైదీలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన ఉంటుందన్నారు. అతిథులకు అరుకు కాఫీ ఉత్పత్తులు, తిరుమల శ్రీవారి ప్రసాదాలు బహుమతిగా ఇవ్వనున్నట్టు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జైళ్ళ శాఖ ఐజి శ్రీనివాసరావు

విమ్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

-రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని- విమ్స్ సందర్శన - ఉన్నతాధికారులు, వైద్యులతో సమీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని తెలిపారు. శుక్రవారం స్థానిక విమ్స్‌ను సందర్శించారు. వార్డుల్లో కలియతిరుగుతూ రోగులతో ఆప్యాయంగా మాట్లాడారు. వైద్యం అందుతున్న తీరు, మందుల పంపిణీపై ఆరా తీశారు. భోజన సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న తీరుపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య విభాగం, ఐసీయూ వార్డులను తనిఖీ చేశారు. అనంతరం నేరుగా రోగులతో సంభాషించారు. ఆరోగ్యశ్రీ, ఐసీయూ, జనరల్ సర్జరీ, న్యూరో, ఫిజియోథెరపీ ఇతర విభాగాలను సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎక్కడా, ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల వైద్యసేవలు సకాలంలో అందించాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబును ఆదేశించారు. మందుల నిల్వల విషయంపై ఫార్మసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఖాళీల భర్తీకి చర్యలు...

సమావేశం మందిరంలో వైద్యులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ రాంబాబు విమ్స్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రి మాట్లాడుతూ విమ్స్‌లో ఖాళీ స్పెషలిస్టు వైద్యుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని, ఇప్పటికే జీవో సిద్ధమైందన్నారు. స్పెషలిస్ట్ వైద్యులకు ఒక్కొకరికి నెలకు రూ.1.60 లక్షల వేతనం చెల్లించేలా అనుమతులు కూడా మంజూరు చేశామని వివరించారు.ఆసుపత్రిలో సమస్యలు, విమ్స్ మెడికల్ కళాశాల అభివృద్ధిపై సీఎం జగన్‌తో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. విమ్స్‌ను సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా అభివద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, నాడు- నేడు నిధులు రూ.250 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

రోగితో మాట్లాడుతున్న మంత్రి రజని

విమ్స్‌లో సిఆర్‌బిఎస్ సెంటర్

కేంద్ర ప్రభుత్వం కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూరోలాజికల్ (సీబీఆర్ఎన్)సెంటర్లు పది ఏర్పాటుకు కేంద్రం శ్రీకారం చుట్టిందని, అందులో విశాఖ ఎంపికైందన్నారు. సిబిఆర్ఎన్ సెంటర్‌ను విమ్స్ లో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికేదీని కోసం సిబ్బంది నియమాకాలు, శిక్షణ కూడా పూర్తయ్యాయని వివరించారు. విమ్స్‌లో డయాగ్నస్టిక్ సెంటర్, ఆయుష్, ఔషధ నియంత్రణ విభాగ భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఎపిఎంఎస్‌డిసి ఎండీ మురళీధర్‌రెడ్డి, డిఎంఇ నర్సింహం పాల్గొన్నారు.